సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 5 । జూలై । 2024



జూనోటిక్ వ్యాధులతో జాగ్రత్త

పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు సంక్రమించే జూనోటిక్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో ▸



వర్జీనియాకు రికార్డు ధర

వర్జీనియా ధరలు పెరుగుతూనే ఉన్నాయి. రోజురోజుకూ ముందుకు సాగుతూ బుధవారం రికార్డు స్థాయిలో కిలో రూ.371 ధర పలికింది. 8లో ▸



సందేశాత్మకంగా నాటికలు

ఏలూరులోని వైఎంహెచ్‌ఏ హాలులో అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు సందేశాత్మకంగా సాగుతున్నాయి. 8లో ▸

రైతు సేవలో.. విజ్ఞాన మడిలో..

కృషి విజ్ఞాన కేంద్రాలు

- దేశవ్యాప్తంగా 50 ఏళ్లుగా సేవలు
- వీఆర్‌గూడెంలో 14 ఏళ్లుగా కార్యక్రమాలు
- అధిక దిగుబడులు, అదనపు ఆదాయ మార్గాలే లక్ష్యం
- నేటి నుంచి స్వర్ణోత్సవాలు

పుడమి తల్లి ఆరోగ్యానికి కాసింత మట్టిని గుప్పిట పట్టి చూస్తారు.. రాసులుగా పంట దిగుబడులకు విజ్ఞానాన్ని అందిస్తారు.. పంటల సంరక్షణకు యాజమాన్య పద్ధతులు నేర్పిస్తారు.. తెగుళ్ల నివారణ మార్గాలు వివరిస్తారు.. తేనెటీగల పెంపకం, విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా అదనపు ఆదాయ మార్గాలను విశదీకరిస్తారు.. నిత్యం రైతులకు విజ్ఞానాన్ని అందిస్తూ వారి సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు. దేశంలో కేవీకేలు ఏర్పాటై 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలను సంబరంలా నిర్వహిస్తున్నారు.



వెంకట్రామన్నగూడెంలో కృషి విజ్ఞాన కేంద్రం



తేనెటీగల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న కేవీకే అధికారులు (ఫైల్)

తాడేపల్లిగూడెం : రైతులకు సాగులో సహాయ, సహకారాలు అందించేందుకు 1974 మార్చి 21న పాండిచ్చేరిలో తొలి కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటైంది. మహదాశయంతో ఏర్పాటు చేసిన కేవీకేలు ఇప్పటికీ 731కు చేరాయి. ఈ క్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో 2010లో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుచేశారు. గత 14 ఏళ్లుగా ఈ కేంద్రం ద్వారా రైతులకు, అభ్యుదయ రైతులకు విశేష సేవలందిస్తున్నారు. స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా ఇక్కడ శుక్ర, శనివారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పాండిచ్చేరిలో ఈ ఏడాది మార్చి 21న స్వర్ణోత్సవ సంబరాలకు శ్రీకారం చుట్టారు. వచ్చే ఏడాది మార్చి 21 వరకు ఏడాది పొడవునా దేశంలోని కేవీకేల్లో సంబరాలు జరపాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ కాగడాను వెలిగించారు. ఈ కాగడాను దేశంలోని అన్ని కేవీకేలకు తీసుకెళతారు. కాగడా తీసుకున్న సందర్భంలో ఆయా కేవీకేల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కాగడా ప్రదర్శన ముగింపు కార్యక్రమం సెప్టెంబర్‌లో ఢిల్లీలో నిర్వహిస్తారు. దీనిలో భాగంగా వీఆర్‌గూడెం కేవీకేలో కాగడాను గురువారం అందుకున్నారు. రెండు రోజుల పాటు సంబరాలు జరుగనున్నాయి.

2010 నుంచి వీఆర్‌గూడెంలో..

రైతులు వ్యవసాయ, సాంకేతిక ఆదాయాన్ని పెంచుకోవడానికి శిక్షణలు, ప్రదర్శనలు, విస్తరణ సేవలను నిర్వహించడం కోసం 2010లో వీఆర్‌గూడెంలో కేవీకే ఏర్పాటైంది. నైపుణ్య అభివృద్ధి, విస్తరణ, వ్యవసాయదారులకు, గ్రామీణ యువత, మహిళలకు అవగాహన కల్పించే దిశగా ముందుకు సాగుతోంది.

మహిళా సాధికారత.. ఉపాధి మార్గాలు

- మహిళా సాధికారత, పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్, ఆహార ఉత్పత్తుల తయారీ, వెదురు ప్రాసెసింగ్, పశుపోషణ, సామాజిక పోషణ తోటలు, ఎండుపూలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై కేవీకే శిక్షణ ఇస్తోంది.
- రైతులకు సరికొత్త సాంకేతిక పద్ధతులు, ఇన్ఫర్మేషన్ కియోస్క్, ఎలక్ట్రానిక్ మీనింగ్ కమ్యూనిటీ రేడియో స్టేషన్ ఏర్పాటు, ఉద్యాన సేవల సమాచారం వాహనం ఏర్పాటు, ఉద్యాన పంటల మొబైల్ అప్లికేషన్, అంతర్జాల శిక్షణా కేంద్రం యూట్యూబ్ ద్వారా, ఆక్వాకల్చర్ పశుపోషణ, వ్యవసాయ ఉద్యాన విభాగాల్లో వినూత్న పద్ధతులు వంటివి అవలంబిస్తున్నారు.
- 42 ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పాటుచేశారు. కొబ్బరి చెట్లు ఎక్కే పరికర వినియోగం, తేనెటీగల పెంపకం, నర్సరీల్లో మొక్కల పెంపకం, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, పెరటితోటల పెంపకం, వీటిపై నైపుణ్య శిక్షణలు అందించారు.
- తృణధాన్యాలు, మత్స్య పశుపోషణ, గృహ విజ్ఞానం, అపరాల పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.
- రైతులకు 827 శిక్షణా కార్యక్రమాలు, విస్తరణ సిబ్బందికి 310 శిక్షణా కార్యక్రమాలు అమలు చేశారు.
- కిసాన్ మేళా, ఉద్యాన ప్రదర్శన, హెల్త్ క్యాంపు, యానిమల్ హెల్త్ క్యాంపులు నిర్వహించారు.
- వర్మీ కంపోస్టు, బయో ఇన్ కిట్స్, మెరుగైన కోళ్ల పెంపకం, జీడిమామిడి మొక్కల పెంపకం, భూసార పరీక్షలు తదితర సేవలందించారు. డ్రోన్ల ప్రదర్శన, శిక్షణ అందించారు.
- గిరిజన మహిళలకు పలురకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.
- కేవీకేల సేవలకు జోనల్, జాతీయస్థాయిలో పండిట్ దీన్‌దయాళ్ కృషి విజ్ఞాన్ ప్రోత్సాహ పురస్కార్ అవార్డును ప్రధాని మోదీ చేతులమీదుగా అధికారులు అందుకున్నారు.

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

కలెక్టర్ నాగరాణి



కలెక్టరేట్‌లో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరామరాజు జయంతి వేడుకలను నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి కలెక్టర్ నాగరాణి, జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు. గిరిజనుల నాయకుడిగా ఎదిగి వారి సంక్షేమానికి కృషిచేశారన్నారు. దేశం కోసం బ్రిటిషర్లతో పోరాటి 27 ఏళ్ల వయసులోనే ప్రాణాలర్పించిన ఆయన త్యాగం చిరస్మరణీయమన్నారు. జేసీ ప్రవీణ్ ఆదిత్య మాట్లాడుతూ అల్లూరి గిరిజనులకు విద్య నేర్పించి వారికున్న హక్కులను వివరించి ధైర్యాన్ని నింపారన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కర రావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి.గణపతిరావు, జిల్లా అగ్నిమాపక దళ అధికారి బి.శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.బి.భానునాయక్, హౌసింగ్ ఈఈ బి.వెంకట రమణ, సూపరింటెండెంట్ సీహెచ్ ఝూన్సీ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలసిన జెడ్పీ చైర్‌పర్సన్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు గురువారం భీమవరం కలెక్టరేట్‌లో కలెక్టర్ సి.నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధిపై కలెక్టర్‌తో చర్చించారు. రైతులకు రావాల్సిన ధాన్యం బకాయిలపై చర్చించారు. పార్టీ నేత మంతెన యోగేంద్రబాబు వారితో ఉన్నారు.

ఆస్పత్రుల తనిఖీ



తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రైవేట్ ఆస్పత్రుల సాధారణ తనిఖీల్లో భాగంగా ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్న శ్రీలక్ష్మి ఆస్పత్రి, అవినాష్ ఆర్థోపెడిక్-ట్రామాకేర్ సెంటర్, రాజర్షి ఆస్పత్రులను డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వర రావు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ సేవలను సకాలంలో అందించాలని సూచించారు. జిల్లా ఆరోగ్య శ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్. కీర్తి ఉన్నారు.

గ్యాస్ ట్యూబ్ మార్పుపై అభ్యంతరం

ఆకివీడు: స్థానికంగా వంట గ్యాస్ సిలెండర్ల ట్యూబ్‌ను తమకు ఇష్టం లేకుండా కొందరు మారుస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. పట్టణంలోని పలు వీధుల్లోని ఇళ్లకు వెళ్లి గ్యాస్ ట్యూబ్ మార్చకుంటే సిలెండర్ రాదని హెచ్చరిస్తూ, వంట గదిలోకి వెళ్లి మరీ ట్యూబ్ మారుస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ట్యూబ్ ఒక్కంటికీ రూ.170 వసూలు చేస్తున్నారని, దీనిపై తహసీల్దార్, గ్యాస్ డీలర్‌కు ఫిర్యాదు చేశామని చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఇష్టం ఉంటేనే ట్యూబ్ మార్చుకోవాలని డీలర్ చెబుతున్నారన్నారు.

దళితులపై దాడి దారుణం

ఉండి: వెంప గ్రామంలో దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అజితను ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) నాయకులు కోరారు. గురువారం కలెక్టర్, ఎస్పీలను వారు కలిసి వినతి పత్రాలు అందజేసినట్టు ప్రకటనలో తెలిపారు. గత నెల 23న రాత్రి నిద్రపోతున్న దళితులను ఇతర కులాల వారు కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. దీనిపై బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని తెలిపారు. అధికారులు వాస్తవాలను పరిశీలించి దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బందెల జార్జ్‌రాజు, ఉండి మండలాధ్యక్షుడు గొల్ల దానియేలు తదితరులు ప్రకటన చేసిన వారిలో ఉన్నారు.

టెండర్ల ఆహ్వానం

భీమవరం(ప్రకాశం చౌక్): తాడేపల్లిగూడెంలోని పురుగు మందుల పరీక్ష ల్యాబొరేటరీకి గ్యాస్ లిక్విడ్ ప్రామెటోగ్రఫీ మెషీన్ సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య గురువారం ప్రకటనలో తెలిపారు. మెషీన్, సాఫ్ట్‌వేర్‌తో కూడిన కంప్యూటర్ సరఫరాకు ఈనెల 16న మధ్యాహ్నం 12 గంటలోపు టెండర్లు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు తాడేపల్లిగూడెంలో ల్యాబొరేటరీ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో, సెల్ 83310 56658లో సంప్రదించవచ్చని తెలిపారు.

28 నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏపీపీఎస్సీ నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షల షెడ్యూల్ విడుదలైందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి వచ్చే నెల 2 వరకు పరీక్షలు నిర్వహిస్తారని, పరీక్షల టైమ్‌టేబుల్ పీఎస్‌సీ.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

డీటీసీ డీఎస్పీ బదిలీ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పెదవేగి పోలీస్ శిక్షణా కేంద్రం డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కింజరపు ప్రభాకరరావును రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. కొంతకాలంగా ఏలూరు జిల్లాలోని డీటీసీలో ఉత్తమ సేవలు అందించిన ఆయన విశాఖపట్నం సిటీ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా బదిలీపై వెళ్లనున్నారు.

హాస్టళ్ల నిర్వహణలో లోపాలు సహించం



భీమవరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల నిర్వహణ మెరుగ్గా ఉండాలని కలెక్టర్ సి.నాగరాణి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లాలో వసతి గృహాల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల నిర్వహణలో లోపాలుంటే ఉపేక్షించబోమన్నారు. విద్యార్థులు చదువులో రాణించేలా వసతులు కల్పిస్తామన్నారు. తాను తరచూ హాస్టళ్లు సందర్శిస్తానని చెప్పారు. జిల్లాలో ఎస్సీ-ప్రీ మెట్రిక్ వసతి గృహాలు 25, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు 13, ఎస్టీ పోస్టు మెట్రిక్ వసతి గృహాలు రెండు, బీసీ ప్రీ మెట్రిక్ వసతి గృహాలు 14, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు 15 మొత్తం 69 హాస్టళ్లు ఉన్నాయన్నారు. కొన్ని హాస్టళ్లలో డ్రైయినేజీ, నీటి అవసరాలను అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్సీ సంక్షేమశాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్పరాణి, బీసీ సంక్షేమ శాఖ అధికారి గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ లక్ష్యాలను పూర్తి చేయాలి

రెవెన్యూ లక్ష్యాలను నిర్దేశిత గడువులోపు పూర్తిచేసేందుకు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లతో సమీక్షించారు. కోర్టు కేసుల డిస్పోజల్‌కు చర్యలు చేపట్టాలని సూచించారు. భూసేకరణ, 22ఏ, కమ్యూనిటీ సర్టిఫికెట్ల జారీ, మీ కోసం ఫిర్యాదుల పరిష్కారం, పట్టాల సబ్ డివిజన్లు, పాస్ పుస్తకాల జారీ, ఇంటింటికి రేషన్ పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. కమ్యూనిటీ సర్టిఫికెట్ల జారీకి త్వరితగతిన విచారణ పూర్తి చేయాలన్నారు. మీకోసం ఫిర్యాదులు నిర్దేశిత గడువులోపు నాణ్యతగా పరిష్కరించాలన్నారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంటు పాల్గొన్నారు.

నూజివీడు మామిడికి ప్రపంచ స్థాయి గుర్తింపునకు కృషి

మంత్రి కొలుసు పార్థసారథి



మామిడి సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు: నూజివీడు మామిడికి ప్రపంచ స్థాయి గుర్తింపునకు సమష్టిగా కృషి చేద్దామని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం నిర్వహించిన మామిడి రైతుల సదస్సులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, మార్కెట్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై నూజివీడు, చాట్రాయి, ముసునూరు మండలాలతో పాటు ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట, తిరువూరు, మైలవరం, రెడ్డిగూడెం, ఎ.కొండూరు పరిసర ప్రాంతాల మామిడి రైతులు, వ్యాపారస్తులు, సంబంధిత అధికారులు, శాస్త్రవేత్తలతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మామిడికి మరింత మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి రైతులకు లబ్ధి చేకూరేలా నూజివీడులో రాబోయే మామిడి సీజన్‌కు మామిడి మార్కెట్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని మామిడి రైతులు ఆధునిక పద్ధతులతో ఉద్యాన శాఖ సలహాలు, సూచనలతో నాణ్యమైన పండ్ల ఉత్పత్తులను సాధించాలన్నారు. రైతులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని, జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మామిడి రైతులకు అనుసంధానం చేయాలని కోరారు. ఉద్యాన శాఖ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్.రామ్మోహన్, ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ అధికారి పి.రవికుమార్, మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్త బొర్రా కనక మహాలక్ష్మి, ఏఎంసీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణపై విస్తృత ప్రచారం



సమీక్షిస్తున్న డీఆర్‌ఓ ఉదయభాస్కర్

భీమవరం(ప్రకాశం చౌక్): జనాభా స్థిరీకరణకు తాత్కాలిక కుటుంబం నియంత్రణ పద్ధతులను విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో స్టీరింగ్ కమిటీ సభ్యులతో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్షించారు. బిడ్డకూ బిడ్డకు మధ్య కనీసం మూడేళ్ల సమయం ఉండాలని, వెను వెంటనే కాన్పులతో తల్లిలో ఎనీమియా సమస్య తలెత్తుతుందన్నారు. జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కుటుంబ నియంత్రణ సాధనాలు అందుబాటులో ఉంచాలన్నారు. పురుషులు వేసక్టమీ ఆపరేషన్లు చేయించుకునేలా ప్రోత్సహించాలన్నారు. అంత్రా ఇంజక్షన్లపై కూడా ప్రచారం చేయాలన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం ప్రచార కార్యక్రమాలు జూన్ 1న ప్రారంభించామని, ఈనెల 24 వరకు కొనసాగుతాయన్నారు. జనాభా దినోత్సవాన్ని ఈనెల 11న నిర్వహిస్తామన్నారు. గర్భ నిరోధకానికి అంత్ర ఇంజక్షన్లపై వాల్‌పోస్టర్లు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ సూర్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ బి.సుజాతరాణి, విద్యాశాఖ ఏడీ సత్యనారాయణ, డీపీఎంఓ ధనలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు 'గుర్తింపు' దక్కేనా?

- సీజన్ ప్రారంభమైనా పూర్తిస్థాయిలో అందని సీసీఆర్‌సీ కార్డులు
- అయోమయంలో కౌలు రైతులు
- లక్ష్యం 1.08 లక్షలు.. మంజూరు 2,600
- మోకాలడ్డుతున్న భూయజమానులు
- గత ప్రభుత్వంలో 90 వేలకు పైగా కార్డుల మంజూరు



కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందిస్తున్న రెవెన్యూ, వ్యవసాయ అధికారులు

2023-24లో సీసీఆర్‌సీ కార్డుల జారీ

మండలం	కార్డులు	మండలం	కార్డులు
తాడేపల్లిగూడెం	6,515	వీరవాసరం	5,796
పెంటపాడు	6,774	పెనుమంట్ర	5,435
తణుకు	4,789	పెనుగొండ	6,186
ఇరగవరం	6,896	ఆచంట	6,495
అత్తిలి	5,708	పోడూరు	6,186
ఉండి	3,834	పాలకొల్లు	3,988
ఆకివీడు	2,573	యలమంచిలి	2,835
కాళ్ల	1,764	నరసాపురం	2,071
భీమవరం	3,025	మొగల్తూరు	536
పాలకోడేరు	4,626	గణపవరం	3,997
		మొత్తం	90,029

ఉండి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందకపోవడంతో వారంతా అయోమయంలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రం (క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డ్) (సీసీఆర్‌సీ) అందిస్తుందో లేదో అనే ఆందోళనలో ఉన్నారు. సీసీఆర్‌సీ కార్డులు లేకపోతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎటువంటి ప్రయోజనాలు అందవని అంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చెప్పిన సమయానికే రైతులు, కౌలు రైతులకు అన్నివిధాలా మేలు జరిగిందని గుర్తు చేసుకుంటున్నారు. గతంలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేయడంతో పాటు విత్తనాలు, ఎరువులు కూడా అందించారు. సాధారణ రైతుల మాదిరిగా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా పంట పెట్టుబడి సాయాన్ని కౌలు రైతుల ఖాతాలకు జమచేశారు.

ఊసెత్తని కూటమి ప్రభుత్వం

ప్రస్తుత కూటమి ప్రభుత్వం కౌలు రైతుల ఊసెత్తకపోవడం ఆందోళన కలిగిస్తోంది. తమకు గుర్తింపు లేకుండా వ్యవసాయంలో ఎటువంటి పథకాలు వర్తించవని, ప్రభుత్వం ప్రయోజనాలు పొందలేమని వీరు అంటున్నారు. గతేడాది (2023-24)లో జిల్లావ్యాప్తంగా 321 గ్రామాల్లో 90,029 సీసీఆర్‌సీ కార్డులను గత ప్రభుత్వం అందించింది. ప్రస్తుత ఏడాది 2024-25లో 1,08,330 సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటివరకు సుమారు 2,600 కార్డులు మాత్రమే అందజేశారు. కొత్త ప్రభుత్వం ఇంకా పని ప్రారంభించే దశలోనే ఉండటంతో ఈ ఏడాది తమ పరిస్థితి ఏంటని కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు.

చురుగ్గా సాగు పనులు

ఖరీఫ్ సీజన్ ఆరంభం కావడంతో కొన్ని ప్రాంతాల్లో నారుమడుల పనులు జరుగుతుండగా మరికొన్ని ప్రాంతాల్లో దుక్కులు చేసుకుని నాట్లు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఈ సమయంలో కౌలు రైతుకు ప్రభుత్వ గుర్తింపు లేకపోతే బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వ సాయం, పెట్టుబడి సాయాలు అందవని అంటున్నారు.

భూయజమానులతో ఇబ్బందులు

సీసీఆర్‌సీ కార్డులు ఇచ్చేందుకు కౌలు రైతుకు తాను సాగుచేసే భూమి యజమాని అంగీకార పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇందుకు చాలా మంది యజమానులు అంగీకరించకపోవడంతో కార్డులు మంజూరు ఆలస్యమవుతున్నట్టు చెబుతున్నారు. అధికారులు భూయజమానులతో సమన్వయం చేసుకుని వారి వద్ద నుంచి కౌలు రైతుకు అనుమతి లభించేలా చేయాలని కౌలు రైతులు కోరుతున్నారు. లేకుంటే తమకు తీవ్ర నష్టాలు తప్పవని వాపోతున్నారు.

పెట్టుబడి సాయమెప్పుడో..

గత ప్రభుత్వంలో ప్రతి సీజన్ ప్రారంభ సమయానికి మాజీ సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి రైతులు, కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేసేవారు. కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే ఖరీఫ్ సీజన్ ఆరంభమై వ్యవసాయ పనులు సాగుతున్నా ఇప్పటికీ దీనిపై నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వ ప్రకటన కోసం రైతులు, కౌలు రైతులు ఎదురుచూస్తున్నారు.

విస్తృతంగా 'స్టాప్ డయేరియా'



వాటర్‌పైప్‌లను పరిశీలిస్తున్న డీపీఓ విశ్వనాథ్

బుట్టాయగూడెం: జిల్లాలో విస్తృతంగా స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. మండలంలోని అంతర్వేదిగూడెంలో గురువారం ఆయన పర్యటించారు. ఏజెన్సీ ప్రాంతంలో కార్యక్రమాలపై కార్యదర్శి ఎం.అంజలీదేవిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిర్వహించిన అతిసార వ్యాధి నివారణ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,500 తాగునీటి ట్యాంకులు, 1300 పీడబ్ల్యూఎస్ స్కీమ్స్, 44 సీపీడబ్ల్యూఎస్ స్కీమ్స్, 2,000 తాగునీటి బోర్లు, 1,000 డైరెక్ట్ పంప్ స్కీమ్స్, 3 లక్షల ప్రైవేటు కుళాయిలు, 3,000 చేతి పంపులను దశలవారీగా శుభ్రపరచి క్లోరినేషన్ చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. గ్రామంలో పైప్‌లైన్‌లను పరిశీలించారు. ఎవిడెన్స్ ఏక్షన్ సంస్థ రీజనల్ కో-ఆర్డినేటర్ జి.ప్రవీణ్‌కుమార్, ఎం.సుమంత్ వర్మ, వైద్యసిబ్బంది వాసంతి, కార్యదర్శులు పి. ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ కింద పడి రైతు మృతి


రాంబాబు (ఫైల్)

జంగారెడ్డిగూడెం రూరల్ : పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతూ ప్రమాదవశాత్తు అదే ట్రాక్టర్ కింద పడి ఓ రైతు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. తాడువాయి గ్రామానికి చెందిన కలపాల రాంబాబు (32) అనే రైతు గ్రామంలోని తన సొంత పొలంలో ట్రాక్టర్ నడుపుతూ దుక్కి దున్నే పనులు చేపట్టారు. దుక్కి దున్నుతున్న సమయంలో ప్రమాదవశాత్తు రాంబాబు ట్రాక్టర్‌పై నుంచి కింద పడిపోగా అదే ట్రాక్టర్ అతనిపై నుంచి వెళ్లడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల రైతులు హుటాహుటినా అతనిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాంబాబు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంతర్ రాష్ట్ర సైబర్ నేరస్తుడి అరెస్ట్

వరంగల్ పోలీసులకు అప్పగింత


పొన్నగంటి తేజ్‌కుమార్


ముసునూరు : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు చోరీలు, సైబర్ నేరాలు చేసి చాకచక్యంగా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.వాసు చెప్పారు. ఇటీవల రమణక్కపేటలో పేకాట ఆడుతూ ముసునూరు మండల పోలీసులకు పట్టుబడిన చాట్రాయి మండలం చిత్తపూరుకు చెందిన పొన్నగంటి తేజ్‌కుమార్ (25) పలు సైబర్ నేరాల్లో నిందితుడిగా ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. ఇప్పటికే నిందితుడిపై తెలంగాణలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదై ఉండడంతో రెండు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా ఉన్నట్లు తేలింది. దీంతో ఇరు రాష్ట్రాల పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. తెలంగాణలోని వరంగల్ పోలీసులు నిందితుడిపై తమ వద్ద పలు కేసులు ఉన్నట్లు గుర్తించారు. దీంతో గురువారం అక్కడి పోలీసులు ముసునూరు స్టేషన్‌కు రాగా కేసును వరంగల్‌కు బదిలీ చేసి, నిందితుడిని అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.

12 నుంచి తణుకులో జిల్లా బ్యాడ్మింటన్ పోటీలు

తణుకు టౌన్: జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలను తణుకులోని శ్రీ చిట్టూరి సుబ్బారావు, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమి ఇండోర్ స్టేడియంలో ఈనెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షురాలు చిట్టూరి సత్య ఉషారాణి, కార్యదర్శి మెంటే వంశీకృష్ణ గురువారం చెప్పారు. ఈ పోటీలు అండర్-11, 13, 15, 17, 19 వయస్సుల బాలబాలికలకు, మహిళలు, వెటరన్స్ 35 ప్లస్ నుంచి 70 ప్లస్ వయస్సుల కేటగిరీలలో సింగిల్స్, డబుల్స్ విభాగాలలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన వారు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలలో ఆసక్తి గల అభ్యర్థులు తమ ఎంట్రీలను ఈనెల 10వ తేదీలోగా తమకు పంపించాలని కోరారు. ఇతర వివరాలకు కోచ్ ఎస్.సతీష్ 99597 96939, యూ సుదర్శన్ 97014 04675 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జూనోటిక్ వ్యాధులతో జాగ్రత్త

- పశువుల నుంచి మానవులకు సంక్రమణ
- పశు పోషకులు, పెంపుడు జంతువుల యజమానులు, వ్యవసాయ రైతులకు సోకే అవకాశం ఎక్కువ
- అప్రమత్తంగా లేకపోతే ప్రాణానికే ప్రమాదం
- రేబిస్, బర్డ్‌ఫ్లూ, అంత్రాక్స్ ఈ కోవలోనివే
- రేపు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం



జంగారెడ్డిగూడెం: పశువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి పశువులకు సంక్రమించే స్వభావం ఉన్న వ్యాధుల్ని జూనోటిక్ వ్యాధులు (సంక్రమిత వ్యాధులు) అంటారు. సుమారు 200లకు పైగా ఈ జూనోటిక్ వ్యాధులు ఉన్నట్లు గుర్తించారు. ఈ జూనోటిక్ వ్యాధులు ఎక్కువగా పశుపోషకులు, పాల ఉత్పత్తిదారులు, పెంపుడు కుక్కల యజమానులు, వ్యవసాయం చేసే రైతులు, పశువైద్యులు, జంతు ప్రదర్శన శాలల సిబ్బంది, పరిశోధన శాలల్లో పనిచేసే సిబ్బందికి ఎక్కువగా వస్తుంటాయి. లూయిస్ పాశ్చర్ అను శాస్త్రవేత్త మొట్టమొదటిసారి 1885వ సంవత్సరం జూలై 6న పిచ్చికుక్క కాటుకి గురైన వ్యక్తి ప్రాణాలను 'యాంటీ రేబిస్ టీకా' ద్వారా కాపాడిన సందర్భంగా ప్రతి సంవత్సరం జూలై 6వ తేదీన 'జూనోసిస్ డే' గా జరుపుకుంటున్నారు. జూనోటిక్ వ్యాధులను వైరస్, బ్యాక్టీరియల్, ప్యారసైటిక్ వ్యాధులుగా విభజించారు. వైరస్ వలన సంక్రమించే వ్యాధులలో పిచ్చికుక్కకాటు వ్యాధి (రేబిస్), మెదడువాపు వ్యాధి (జపనీస్ ఎన్‌సెఫలైటిస్), బర్డ్‌ఫ్లూ వ్యాధులు ముఖ్యమైనవి. బాక్టీరియా వలన సంక్రమించే వ్యాధుల్లో బ్రూసెల్లా, సాల్మోనెల్లా, లెప్టోసైరోసిస్, క్షయ, దొమ్మరోగం, ధనుర్వాతం ముఖ్యమైనవి. పరాన్న జీవుల వలన సంక్రమించు వ్యాధుల్లో బద్దెపురుగులు, ఏలికపాములు, ఫైలేరియా హైడాటిడ్ వ్యాధులు ముఖ్యమైనవి. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం జంతువులు, మానవుల మధ్య వ్యాధుల వ్యాప్తిని నిరోధించడంలో మన ఉమ్మడి బాధ్యతను గుర్తు చేస్తుంది. వ్యాధులపై అవగాహన, నివారణ చర్యలను తీసుకోవడం చేయడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడటంతో పాటు మానవుల, జంతువుల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తోంది.

పెంపుడు జంతువుల యజమానులకు సూచనలు

- పెంపుడు జంతువుల్లో ముఖ్యంగా రేబీస్ నివారణ కోసం టీకాలు సకాలంలో వేయించడం ముఖ్యం. పశువైద్యుడు సూచించిన టీకాల షెడ్యూల్‌ను తప్పనిసరిగా పాటించాలి
- పెంపుడు జంతువులను, వాటి ఆహారాన్ని లేదా వ్యర్థాలను తాకిన తర్వాత చేతులను శుభ్రంగా కడగడం, లిట్టర్ బాక్సులు, పంజరాలను తరచుగా శుభ్రం చేయాలి.
- బయట తిరిగే జంతువులకు క్రమం తప్పకుండా క్రిములను తొలగించాలి
- పెంపుడు జంతువులు అడవి జంతువులతో కలవకుండా చూడటంతో పాటు, సరైన రక్షణ లేకుండా గాయపడిన అడవి జంతువులను రక్షించడానికి ప్రయత్నించవద్దు.
- అనారోగ్య లక్షణాలను గమనించాలి. ప్రవర్తన, ఆకలి, లేదా రూపంలో మార్పులను గమనించడం, ఏదైనా అసాధారణమైనది గమనిస్తే వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి.

పాడి రైతులకు..

బలమైన జీవభద్రతా చర్యలను అమలు చేయాలి. పశువుల దగ్గరకు అవసరమైన వ్యక్తులను మాత్రమే అనుమతించాలి. జంతు సమూహాల మధ్య కదిలేటప్పుడు పాద రక్షలు, రక్షిత దుస్తులను ఉపయోగించాలి. పశుశాలలు, పాలు పిండే ప్రదేశాలు, పరికరాలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి. పాలు పిండేటప్పుడు కఠినమైన పరిశుభ్రతా నియమాలను అమలు చేయాలి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు పరీక్షలు నిర్వహించాలి. అనారోగ్యంతో ఉన్న జంతువులను వెంటనే మంద నుంచి వేరు చేయాలి. జూనోటిక్ వ్యాధుల ప్రమాదాలు, నివారణ చర్యలపై సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు, అవసరమైనప్పుడు వ్యక్తిగత రక్షణ పరికరాల వాడకాన్ని ప్రోత్సహించాలి.

కోళ్ల రైతులకు..

కోళ్లను పెంచే ప్రాంతాల్లో ప్రత్యేక దుస్తులు, పాదరక్షలను ఉపయోగించాలి. ఒకే వయస్సు ఉన్న పక్షులను కలిపి పెంచడం, గుంపుల మధ్య పూర్తిగా శుభ్రపరిచి, ఆ ప్రాంతంలో క్రిమిసంహార మందులు చల్లాలి. అడవి పక్షులతో సంపర్కాన్ని నివారించడానికి వలలు లేదా మూసివేసిన గూళ్లను ఉపయోగించాలి. ఆహారం తీసుకోవడంలో లేదా గుడ్ల ఉత్పత్తిలో తగ్గుదల వంటి అనారోగ్య లక్షణాలను గమనించడంతో పాటు, అసాధారణ మరణాలు లేదా లక్షణాలను వెంటనే పశువైద్య అధికారులకు తెలియజేయాలి. పక్షులు లేదా గుడ్లతో సంపర్కం తర్వాత చేతులను పూర్తిగా కడగాలి.

అవగాహన పెంచుకోవాలి

- జూనోటిక్ వ్యాధుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి
- జంతు ఆరోగ్యం, జూనోసిస్‌పై వర్క్‌షాప్‌లు లేదా సెమినార్‌లకు హాజరుకావాలి
- అనుమానిత జూనోటిక్ వ్యాధులను గుర్తిస్తే పశువైద్యులు, అధికారులకు తెలియజేయాలి
- జంతు ఉత్పత్తులను పూర్తిగా వండటం, సురక్షితమైన ఆహార నిర్వహణ, సరైన రీతిలో నిల్వను పాటించాలి
- వ్యాధులను వ్యాప్తి చేసే కీటకాలు, ఎలుకల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి
- సమగ్ర ఆరోగ్య విధానాన్ని ప్రోత్సహించే పద్ధతులను పాటించాలి

ముందస్తు నివారణ చర్యలు మేలు



జూనోసిస్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వల్ల మనుషులకు, అటు జంతువులకు ఎంతగానో ఉపయోగపడతాయి. ముఖ్యంగా ప్రాణాంతక జోనోసిస్ వ్యాధులపై సరైన అవగాహన ఉంటే చాలా వరకు వీటిని అరికట్టవచ్చు. జూనోసిస్ వ్యాధుల సంక్రమణ, నివారణపై అవగాహన కలిగించేందుకు ప్రాథమిక విద్య నుంచి జూనోసిటక్ వ్యాధులను విద్యార్థులకు తెలియజేయాలి.

డాక్టర్ బీ.ఆర్.శ్రీనివాసన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్

పోలవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలి


అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: అల్లూరి సీతారామరాజు జయంతిని మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. టి.నరసాపురంలో బంజారా బజరంగీ భేరి ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దేవరపల్లి ముత్తయ్య మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీషు వారిని ఎదిరించడానికి సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకుని మన్యం ప్రాంతాన్ని విముక్తి చేయడం కోసం, గిరిజన హక్కుల కోసం పోరాడుతూ ప్రాణత్యాగం చేసిన గొప్ప విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. బంజారా బజరంగీ భేరి మండల నాయకులు భూక్యా బిగనాథం నాయక్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ప్రాణత్యాగానికి ప్రతిఫలంగా పోలవరం కేంద్రంగా చుట్టుపక్కల ఉన్న గిరిజన ప్రాంతాలను ఆదివాసీ జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జరభల చందా నాయక్, చిన్నం భీమయ్య, నాగనబోయిన వెంకటేశ్వరావు, జోనుబోయిన శ్రీనివాసరావు, సాయల సత్యనారాయణ, జోనుబోయిన కోటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పుట్రేబ్ జంక్షన్, ఏఎస్ఆర్ నగర్‌లో అల్లూరి జయంతిని నిర్వహించారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు అనుమాలు మురళీ మాట్లాడుతూ అల్లూరిని స్ఫూర్తిగా తీసుకుని పేదలకు అండగా పోరాటం చేయాలన్నారు. ఏఎస్ఆర్ నగర్ గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.

ఏలూరులో సుమన్ చిత్రం షూటింగ్


ఏలూరు కో-ఆప్షన్ సభ్యుడు పెదబాబు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సినీ నటుడు సుమన్

ఏలూరు టౌన్: నేటి సమాజంలో పవిత్రమైన వివాహ బంధాన్ని యువత చిన్న అంశంగా, చులకనగా చూస్తోందని, వివాహమైన ఆరు నెలలకే విడాకులు తీసుకునే పరిస్థితులు నెలకొంటున్నాయని, భారత వైవాహిక బంధం విలువను యువతకు తెలియజేయాలనే ఉద్దేశంతో మంచి చిత్రాన్ని నిర్మిస్తున్నామని ప్రముఖ సినీ నటుడు సుమన్ చెప్పారు. తాను తీయనున్న సినిమా షూటింగ్‌కు సంబంధించి సహకారం కోరుతూ ఆయన ఏలూరు కార్పొరేషన్ కార్యాలయానికి గురువారం వచ్చారు. ఈ సందర్భంగా ఏలూరు కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. సమాజంలో యువతకు వివాహ బంధాన్ని తెలియజేస్తూ సందేశాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నామని, మీరంతా సహకరించాలని కోరారు. ఏలూరు నగరంలో తీసే సినిమా షూటింగ్‌కు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏలూరు నగర కార్పొరేటర్లు, నాయకులు సినీనటుడు సుమన్‌ను ఘనంగా సత్కరించారు.

ఖతర్ అగ్నిప్రమాదంలో గుమ్మలూరు వాసి మృతి


మృతుడు షేక్ బాషా (ఫైల్)

పోడూరు: పొట్టకూటి కోసం గల్ఫ్ దేశం వెళ్లిన ఓ వ్యక్తి అక్కడ జరిగిన అగ్నిప్రమాదంలో మృతి చెందడంతో స్వగ్రామం గుమ్మలూరులో విషాదఛాయలు నెలకొన్నాయి. మృతుడి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుమ్మలూరు గ్రామానికి చెందిన షేక్ బాషా (46) ఉపాధి నిమిత్తం మూడేళ్ల క్రితం ఖతర్ దేశానికి వెళ్లాడు. ఏడాది క్రితం స్వదేశానికి వచ్చి కొద్దిరోజులు ఉండి వెళ్లాడు. రెండోసారి వెళ్లినపుడు కుమారుడు వలీని కూడా ఉపాధి కల్పించే నిమిత్తం తన వెంట తీసుకెళ్లాడు. బాషా అక్కడి టైల్స్ కంపెనీలో పనిచేస్తుండగా, కుమారుడు వలీ డ్రైవర్‌గా పనిచేస్తూ ఇద్దరూ ఒకే రూమ్‌లో ఉండేవారు. ఇదిలా ఉండగా, ఈ నెల 3వ తేదీ సాయంత్రం వీరిద్దరూ ఉండే రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బాషా పూర్తిగా కాలి బూడిదయ్యాడు. వలీకి రెండు చేతులు కాలి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరుంటున్న రూమ్‌లో అగ్ని ప్రమాదం జరగడానికి గల కారణాలు తెలియలేదు. ప్రమాద ఘటనపై ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా ప్రమాదంలో బాషా మృతి చెందిన విషయం అక్కడ తెలిసినవారి ద్వారా అదేరోజు రాత్రి గుమ్మలూరులో కుటుంబసభ్యులకు సమాచారం అందడంతో బాషా భార్య మీరాబీబీ, కుమార్తె తనూజ బేగం తల్లడిల్లిపోయారు. పొట్టకూటి కోసం వలస వెళ్లి ప్రమాదంలో మృతి చెందడాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

చిరస్మరణీయుడు వంగవీటి రంగా


తణుకులో రంగా విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: పేద ప్రజల హక్కులు కోసం పోరాడిన మహనీయుడు వంగవీటి మోహన రంగారావు అని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. గురువారం వంగవీటి మోహన రంగారావు జయంతి సందర్భంగా తణుకు వెంకటేశ్వర థియేటర్ సెంటర్, పాతూరు తదితర చోట్ల రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగవీటి రంగా పేద ప్రజల కోసం శ్రమించారని, పేదలకు ఇళ్ల స్థలాలు కోసం దీక్షలు చేస్తున్న సమయంలో మోహన్ రంగాను దారుణంగా హత్య చేశారన్నారు. రంగా సేవలు చిరస్మరణీయమని అన్నారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో రంగా విగ్రహానికి గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, నాయకులు, అప్పారావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

హుండీ దొంగ అరెస్టు

ద్వారకాతిరుమల: శ్రీవారి హుండీలోని నగదును తస్కరించిన ఓ వ్యక్తిని గురువారం దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతలపూడికి చెందిన దుడ్డి పవన్‌కుమార్ గురువారం శ్రీవారి ఆలయ అనివేటి మండపంలోని హుండీలో చేయిపెట్టి రూ.500 తస్కరించాడు. దీన్ని గమనించిన సెక్యూరిటీ సిబ్బంది అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దేవస్థానం సెక్యూరిటీ గార్డు అల్లాడ ధర్మావతి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సతీష్ తెలిపారు. ఇదిలా ఉంటే పవన్‌కుమార్‌పై ఇప్పటికే 10 వరకు దొంగతనం కేసులు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.

సందేశాత్మకంగా నాటికల ప్రదర్శన

ఏలూరులో వైభవంగా ప్రారంభమైన ఏఎస్సార్ స్మారక రాష్ట్ర నాటిక పోటీలు


రాజుగారి గోచి నాటిక ప్రదర్శనలోని ఓ సన్నివేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరంలోని హిందూ యువజన సంఘం, హేలాపురి కళాపరిషత్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు గురువారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత వీరన్నపాలెం కళానికేతన్ సంస్థ ఆధ్వర్యంలో నారిపెద్ది శివన్నారాయణ రచించిన రాజుగారి గోచి అనే నాటికను చిట్టినేని సాయిబాబు దర్శకత్వంలో అద్భుతంగా ప్రదర్శించారు. నేర విచారణ, నేరస్తుడికి శిక్ష కంటే కూడా నేరం వల్ల అనాథలైన బాధితులను ఆదుకోవడం ముఖ్యం అనే ఉద్దేశంతో ఈ నాటకం ప్రదర్శించారు. కేవలం ఆరువేల జనాభా కలిగిన ఒక చిన్న దీవిలో రాజు సరదాలకు ప్రజల నుంచి పన్నులు పిండడం, పేదల శ్రమను దోచుకునేందుకు జూదశాల ఏర్పాటు చేయడం దానివల్ల ఒక హత్య జరగడం వంటి సంఘటనలతో నాటకం ఆసక్తిగా సాగుతుంటుంది. ఈ నేపథ్యంలో హంతకుడికి రాజు ఉరిశిక్ష విధించగా, శిక్ష అమలు చేయలేక దానిని జైలు శిక్షగా మార్చడం, నేరస్తుడికి భోజనం పెట్టి పోషించడం, వానికి కాపలాగా భటుడిని నియమించడం రాజ్యానికి ఆర్థికంగా భారంగా మారుతుంది. దాని నుంచి బయటపడడానికి నేరస్తుణ్ణి విడిచిపెట్టడానికి ప్రయత్నించగా కూర్చుని తినడానికి అలవాటుపడ్డ నేరస్తుడు జైలు నుంచి విడుదల కావడానికి నిరాకరించడం చివరికి అతని కోరికలన్నీ తీర్చి దేశం దాటించడంతో కథ ముగుస్తుంది. ప్రణాళిక లేని పాలన, పాలకుల విలాసాలకు ప్రజాధనం వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను కళ్లకు కట్టినట్టు చూపడంలో దర్శకుడు సఫలమయ్యాడు.

అనుబంధాలను గుర్తు చేసిన అమృత హస్తం

ఈ పోటీల్లో రెండవ నాటికగా రాత్రి 8 గంటలకు ప్రదర్శించిన అమృతహస్తం నాటిక నేటి సమాజంలో మాయమైపోతున్న అనుబంధాలను గుర్తు చేసింది. ఒక తల్లి కడుపున పుట్టిన అన్నాచెల్లెళ్ల మధ్య ఎటువంటి అనుబంధం ఉండాలో సమాజానికి చెప్పింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న చెల్లెలిని అష్టకష్టాలు పెడుతున్న భర్తతో కాపురం సజావుగా సాగడానికి అన్న ఎన్నో విధాలుగా ఆదుకుంటూ ఉంటాడు. ఈ క్రమంలో అనారోగ్యానికి గురైన చెల్లిని, బావని పోషిస్తుంటాడు. ఇది నచ్చని అన్న భార్య అతనిని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఈలోగా ఇంట్లో తిష్ట వేసిన బావ అన్న నుంచి డబ్బులు గుంజుతూ చివరకు అన్న ఇంట్లో సగభాగం రాయించమని భార్యను వేధించడం ప్రారంభిస్తాడు. ఈ వేధింపుల భరించలేక అన్నా చెల్లెలు కలిసి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో బావ చేస్తున్న అరాచకాన్ని రికార్డు చేసి దాని ద్వారా అతనికి న్యాయస్థానంలో పడే శిక్షను గురించి వివరిస్తారు. దీనితో బావ తన తప్పు తెలుసుకోవడంతో కథ ముగుస్తుంది. కావూరి సత్యనారాయణ రచనకు ఏపూరి హరిబాబు దర్శకత్వ ప్రతిభ తోడు కావడం, నటీనటుల హావభావాలు దానికి మరింత వన్నెతేవడంతో నాటక ప్రదర్శన రక్తికట్టింది.

తొలుత జరిగిన ప్రారంభ సభలో హిందూ యువజన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు, హేలాపురి కళాపరిషత్ సంస్థ అధ్యక్షులు పెదపాటి రామకృష్ణ, గౌరవ అధ్యక్షులు గుత్తా కౌసలేంద్రరావు, కార్యదర్శి సంకు సురేష్ జ్యోతి ప్రజ్వలన చేశారు. హేలాపురి కళాపరిషత్ కోశాధికారి ఎండీ ఖాజావలి స్వాగతం పలికారు. వల్లముల రామాంజనేయ సిద్ధాంతి, ఘంటసాల పెద్దిరాజు, ఎం.సూర్యనారాయణ యాదవ్, కేసా సాంబశివరావు, జిల్లెళ్ళమూడి వరప్రసాదరావు, మండవ రాజగోపాల్ పాల్గొన్నారు. అనంతరం రెండు నాటిక కళా సమాజాల ప్రతినిధులను ఇరు సంస్థల పక్షాన నూతన వస్త్రాలతోపాటు నగదు పారితోషికాన్ని అందించి సత్కరించారు.

భూపరిహారం కోసం ఏడేళ్లుగా నిరీక్షణ

- బ్యాంక్ రుణం చెల్లించినా అందని పరిహారం సొమ్ము
- అవస్థలు పడుతున్న కుక్కునూరు, వేలేరుపాడు రైతులు

కుక్కునూరు : పంటకోసం తీసుకున్న రుణం వసూలు కోసం కోర్టుకెక్కి పరిహారాన్ని నిలుపుదల చేయడంతో బ్యాంక్ రుణం చెల్లించినా ఇంకా తమకు పూర్తి స్థాయిలో అందాల్సిన భూపరిహారం కోసం ఏడేళ్లుగా నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ముంపు పేరుతో తెలంగాణలోని 7 మండలాలను ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. ఈ నేపథ్యంలో 2016, 2017 సంవత్సరాల్లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో ముంపునకు గురవుతున్న భూములను సర్వే చేసి గుర్తించిన అప్పటి ప్రభుత్వం పరిహారం అందించింది. కాగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో కొందరు రైతులు వ్యవసాయం నిమిత్తం బూర్గంపాడు ఎస్‌బీహెచ్ శాఖలో పంట రుణాలు తీసుకున్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఈ మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడంతో తమ బ్యాంక్ రుణాలు వసూలు చేసుకునే నిమిత్తం బ్యాంక్ అధికారులు రైతులు చెల్లించాల్సిన రుణానికి సంబంధించి పరిహారం హోల్డ్ చేసేలా కోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై అటు బ్యాంక్ అధికారులు కానీ, ఇటు భూసేకరణ అధికారులు కానీ రైతులకు సమాచారం అందించలేదు. కోర్టు ఆదేశాల మేరకు రైతులు బ్యాంక్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని హోల్డ్ చేసిన ప్రభుత్వం బ్యాంక్‌లో చెల్లించాల్సిన రుణం పోను తక్కిన పరిహారాన్ని రైతుల ఖాతాలో జమ చేసింది. ఇది తెలియని రైతులు తమకు ఇంకా పరిహారం రావాలంటూ పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా నిరాశే మిగిలింది. ఏ అధికారిని కలిసినా సరైన సమాధానం లభించక తమ పరిహారం ఎందుకు ఆగిందో తెలియక రైతులు అయోమయానికి గురయ్యారు. అలా తమకు జరిగిన అన్యాయాన్ని రెడ్డిమళ్ల శ్రీనివాసరావు అనే రైతు గత ప్రభుత్వంలోని నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబుని కలిసి తన సమస్యను వివరించడంతో ఆయన ఆదేశాల మేరకు అధికారులు సమచారాన్ని అందించడంతో రిట్ పిటీషన్ విషయం వెలుగుచూసింది. కాగా ఇప్పటికే బ్యాంక్‌కు రుణం చెల్లించినప్పటికీ బ్యాంక్ అధికారులు రిట్ పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకుంటే తప్ప పరిహారం చెల్లించలేమని అధికారులు చెబుతుండటంతో ప్రభుత్వం దీనిపై చొరవ చూపి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్నా.. పరిహారం ఇప్పించండి



పోలవరం పరిహారం రాక ముందే బ్యాంక్ రుణం చెల్లించాను. అయినా నాకు రావాల్సిన భూపరిహారం సొమ్ము మొత్తం జమ కాలేదు. పరిహారం జమకాని విషయమై అప్పటి భూసేకరణాధికారి షాన్‌మోహన్ కలిసి దరఖాస్తు ఇస్తే ఆయన అసలు విషయం చెప్పకుండా దరఖాస్తును విసిరికొట్టారు. నాలాంటి రైతులు ఇంకా చాలా మంది ఉన్నారు. ఇప్పుడు నేను రెండు కిడ్నీల సమస్యతో బాధపడుతున్నాను. బ్యాంక్, ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరగలేను. ఈ సమస్యను ప్రభుత్వం, బ్యాంక్ అధికారులు సత్వరమే పరిష్కరించి పరిహారాన్ని అందించాలి.

– రెడ్డిమళ్ల శ్రీనివాసరావు, రైతు, శ్రీధరవేలేరు (గ్రామం), కుక్కునూరు

వర్జీనియాకు రూ.371తో రికార్డు ధర

జంగారెడ్డిగూడెం: వర్జీనియా ధరలు పెరుగుతూనే ఉన్నాయి. రోజురోజుకు నూతన రికార్డులు నమోదు చేస్తూ ముందుకు సాగుతున్న వర్జీనియా ధర బుధవారం రికార్డు స్థాయిలో కేజీ రూ.371 ధర పలకగా, అదే ధరను గురువారం కూడా కొనసాగించింది. ఏలూరు జిల్లా పరిధిలో ఉన్న మూడు వేలం కేంద్రాలైన జంగారెడ్డిగూడెం-1, జంగారెడ్డిగూడెం-2, కొయ్యలగూడెం వేలం కేంద్రాల్లో గురువారం వర్జీనియా ధర రూ.371 నమోదైంది. గత కొద్ది రోజులుగా వర్జీనియా ధరలు రూ.350పైనే నమోదు కావడం, సగటు ధరలు సైతం రూ.350కు చేరుకోవడం రైతుల్లో ఆనందాన్ని నింపుతోంది. రూ.300 పైబడి వర్జీనియా ధర వస్తేనే ఈ ఏడాది కోలుకునే పరిస్థితి ఉందని రైతులు భావించారు. గత ఏడాది వర్జీనియా వేసిన సమయంలో వచ్చిన మిచాంగ్ తుపాను రైతులను తీవ్రంగా నష్టపరిచింది. అయినప్పటికి మొక్కవోని ధైర్యంతో రైతులు రెండోసారి పంట వేశారు. తుపానుకు దెబ్బతిన్న పొలాన్ని సాగుకు సిద్ధం చేయడం, రెండుసార్లు పంట వేయాల్సి రావడంతో పెట్టుబడులు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలోనే రైతులు అధిక ధరను ఆశించారు. అయితే అనుకున్న ధరను మించి రావడంతో రైతులు సంతోషంతో ఉన్నారు. నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేయడంతో పాటు విదేశాల్లో మన పొగాకు మంచి డిమాండ్ ఉండటం, అంతర్జాతీయంగా ఉత్పత్తి తగ్గడం వర్జీనియా రైతులకు కలిసి వచ్చింది. ఈ ర్యాలీ ఇలానే కొనసాగితే ఈ ఏడాది రైతులు లాభాల బాటన పట్టినట్టే.

క్లుప్తంగా

నిజాయతీ గల వ్యక్తి రోశయ్య



రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వాసవి, ఆర్యవైశ్య సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నిజాయతీ గల వ్యక్తి రోశయ్య అని పలువురు ఆర్యవైశ్యులు కొనియాడారు. రోశయ్య జయంతి సందర్భంగా గురువారం వాసవి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలోని రోశయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లలర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లేపర శ్రీరామచంద్రమూర్తి, కార్యదర్శి నున్నా సుందరరావు, కోశాధికారి భోగవల్లి రమేష్, ఆలపాటి సత్యనారాయణ, మండవల్లి నాగేంద్ర, సమయమంతుల వైకుంఠం, కొత్త శివకుమార్, వాసవి, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

ముద్ద వాపు చర్మ వ్యాధి టీకాల పంపిణీ



పెదతాడేపల్లి గ్రామంలో ఆవులకు టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి గ్రామంలో గురువారం ఆవులకు ముద్ద వాపు చర్మ వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోతుల అన్నవరం మాట్లాడుతూ పాడి రైతులు ముద్ద వాపు చర్మ వ్యాధి సోకకుండా ముందస్తు టీకాలు వేయించాలన్నారు. మండల పశువైద్యాధికారి టీవీ.విజయ్‌కుమార్, ఎమ్పీటీసీ పి.సత్యనారాయణ, గోపాల మిత్ర బుజ్జియ్య, పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందుడి జీవితం యువతకు ఆదర్శం



వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్వామి వివేకానందుడి జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని 24 వార్డులో గురువారం స్వామి వివేకానందుడి 122వ వర్ధంతి నిర్వహించారు. గ్రామంలోని వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు వివేకానందుడు అని కొనియాడారు. అప్పయ్యశాస్త్రి, సత్యనారాయణ, నరసింహం పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి



ఏరియా ఆస్పత్రి వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సూర్యనారాయణ, మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావులు పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణకు మార్గమని గురువారం ఏరియా ఆస్పత్రి వద్ద అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం దృష్ట్యా సీజనల్‌గా జ్వరాలు వస్తాయన్నారు. డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త పడాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

యలమంచిలి: నారినమెరక పంచాయతీ గమళ్లపెంటలో ఒకటి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రంలోని బాలలకు గ్రామానికి చెందిన యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపిమూర్తి సుమారు రూ.10 వేలు విలువ చేసే నోటు పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రి అందజేశారు. వాటిని యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకుల చేతుల మీదుగా గురువారం విద్యార్థులకు వీటిని అందించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు మాట్లాడుతూ గోపిమూర్తి పేద విద్యార్థులకు 2007 నుంచి క్రమం తప్పకుండా నోటు పుస్తకాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వలవల విష్ణు బాలాజీ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శి పంతం రామ్మూర్తినాయుడు, కోశాధికారి వి.సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

విప్లవ వీరుడు అల్లూరి



అత్తిలి మండలం కొమ్మరలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న క్షత్రియులు

అత్తిలి: సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి, దాని కోసమే తన ప్రాణాలను అర్పించిన మహోన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని గ్రామ సర్పంచ్ మంతెన రామసీత అన్నారు. అత్తిలి మండలం కొమ్మర గ్రామంలో గురువారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు మంతెన పెద్దిరాజు, మంతెన వాసురాజు, ముదునూరి బాలకృష్ణంరాజు, మంతెన సత్యనారాయణరాజు, మంతెన శ్రీరామరాజు, మంతెన గోపాలరాజు, పెన్మెత్స పుల్లంరాజు, పెన్మెత్స వెంకటరాజు, మంతెన వెంకట సూర్యనారాయణరాజు, మంతెన రవి రాజు, పెన్మెత్స బాబు, మంతెన సూర్యనారాయణ రాజు,చింతలపాటి కాసురాజు పాల్గొన్నారు.

స్వాతంత్రోద్యమంలో అల్లూరి పోరాటం చిరస్మరణీయం

తణుకు టౌన్: భారత స్వాతంత్ర్యోద్యమంలో అల్లూరి సీతారామరాజు పాత్ర చాలా ప్రముఖమైనదని వెంకటరమణ సేవా సమితి వ్యవస్థాపకులు కొలనువాడ పెద కృష్ణంరాజు చెప్పారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా తణుకు రూరల్ మండలం తేతలిలోని క్షత్రియ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలు, ఉచిత వైద్య సేవా కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజలను సంస్కరించి వారిని దేశ విముక్తి కోసం గెరిల్లా సాయుధ దళంగా రూపొందించారని తెలిపారు. ఆయన చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరికీ వైద్య సహాయం అందించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. ఈసందర్భంగా భీమవరం విష్ణు దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ కంటి వైద్యశాల ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు, కళ్ల జోళ్ల అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వేగేశ్న గోపాల కృష్ణంరాజు (దత్తుడు) క్షత్రియ యువత సేవా కార్యక్రమాలకు రూ. 50 వేలను విరాళంగా అందజేశారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా తణుకులోని సంధ్యా జ్యోతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఉచితం భోజనం అందజేశారు. క్షత్రియ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలలో మొత్తం 120 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 70 మంది దంత పరీక్షలు, 50 మంది కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రామకృష్ణంరాజు, నడింపల్లి రఘువర్మ, సామంతపూడి సూర్యనారాయణ రాజు, రుద్రరాజు గోపాలకృష్ణంరాజు, పాత్తూరి సుబ్రహ్మణ్యం వర్మ, క్షత్రియ యువత సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి కార్యక్రమాన్ని తణుకు పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తణుకు పట్టణంలోని వీరనారాయణ థియేటర్ వద్ద గల అల్లూరి విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు నార్ని తాతాజీ ముఖ్యఅతిథిగా పాల్గొని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అవినాష్ కాంత్, ఉపాధ్యక్షుడు రాసాబత్తుల అనుకుమార్, ప్రధాన కార్యదర్శి బొల్లాడ నాగరాజు, మహిళా మోర్చ కార్యదర్శి కిరణ్మయి, యువమోర్చా నాయకులు బడేటి సాయి రామ్, శివప్రసాద్, సూర్యరామారావు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తకు నివాళులు

తణుకు: తణుకు పట్టణంలోని పలువురు స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తలకు స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ గురువారం నివాళులర్పించారు. వంగవీటి మోహనరంగా జయంతి పురస్కరించుకుని వెంకటేశ్వర థియేటర్ సెంటర్, కొమ్మాయిచెరువు గట్టు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి పురస్కరించుకుని వేల్పూరు రోడ్డులోని విమాక్స్ థియేటర్ వద్ద అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో స్వామివివేకానంద వర్ధంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే రాధాకృష్ణ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెదేపా, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో...

అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ప్రజలు, యువత ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ కోరారు. గురువారం స్థానిక అమరవీరుల భవనం వద్ద ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో అల్లూరి 127వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, ఎస్.ఆదినారాయణబాబు, అంబటి బ్రహ్మాజీ, గోవిందరాజు, రామారావు, రమేష్, నాగేంద్ర, నానాజీ పాల్గొన్నారు.

సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా గురువారం తాడేపల్లిగూడెం నుంచి అల్లూరి స్వగ్రామం మోగల్లు మీదుగా భీమవరం సీతారామరాజు విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అల్లూరి స్ఫూర్తితో రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ప్రజలు, యువత పెద్ద ఎత్తున ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీకు విభజన హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణ, జి.శ్రీను, ఎస్.కృష్ణ, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మానంద రెడ్డి మార్కెట్‌లో..

అల్లూరి సీతారామరాజు జయంతిని స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో ఘనంగా నిర్వహించారు. రామరాజు చిత్రపటానికి నివాళ్లర్పించారు. సీఐటీయూ నాయకులు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, చల్లా చంద్రరావు, సుబ్బారావు, జి.శ్రీను, బి.భాను, వెంకన్న కార్మికులు పాల్గొన్నారు.

అల్లూరి జీవితం నేటి యువతకు ఆదర్శం

తణుకు: మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు విప్లవ స్ఫూర్తి, పోరాట పటిమ, దేశభక్తి నేటి యువతకు ఆదర్శం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతి పురస్కరించుకుని గురువారం సీపీఐ తణుకు పట్టణ సమితి ఆధ్వర్యంలో స్థానిక వీమాక్స్ సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సీపీఐ తణుకు పట్టణ నాయకులు గుబ్బల వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణ, పుట్టా అమ్మిరాజు, బొద్దాని మురళీకృష్ణ, బొద్దాని కృష్ణకిశోర్, నూనె రాధాకృష్ణ, ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు.



సీఐటీయూ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న నాయకులు



తేతలిలో క్షత్రియ యువత్ ఆధ్వర్యంలో అల్లూరి విగ్రహానికి భారీ పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పెద కృష్ణంరాజు తదితరులు



తణుకులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

డిగ్రీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

పెంటపాడు: పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 సంవత్సరానికి గాను డిగ్రీలో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ హానర్స్, బీఎస్సీ హానర్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, జువాలజీ మేజర్, మాథ్స్‌మేజర్, కెమిస్ట్రీ మేజర్, ఎకనామిక్స్‌మేజర్‌లో చేరేగోరో విద్యార్థులకు సీట్లు ఉన్నాయన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు కళాశాల సహాయక కేంద్రాలతో పాటు, దూరప్రాంత విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్‌నెంబర్లకు 99592 54128,79894 66229 సంప్రదించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక పాతూరు సెమి ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ పీఅండ్‌టీ కాలనీ ఫీడర్, 11 కేవీ జెడ్పీ ఫీడర్, 11 కేవీ మహాలక్ష్మినగర్ ఫీడర్స్‌కు విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 5వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. మెయిన్ రోడ్డు, పీ అండ్ టీ కాలనీ, మహాలక్ష్మి నగర్, సత్యవతి నగర్, మసీద్ సెంటర్, పాతూరు ఏరియాల్లో విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. దీంతో కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, ఇటుకులగుంట, అమృతపురం, మోదుగ గుంట, గొల్లగూడెం, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, ఎల్.అగ్రహారం, కొండ్రుప్రోలు, టిడ్కో గృహాలు, కేఎస్ఎన్.కాలనీకి విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

6న ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు

అత్తిలి: జూనోసిస్ డే సందర్భంగా ఈనెల 6వ తేదీన అత్తిలి ప్రాంతీయ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ కె నరశింహారావు గురువారం తెలిపారు. కుక్కల పెంపకందారులు తమ పెంపుడు కుక్కలను తీసుకువచ్చి వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆయన కోరారు.

తాగునీటి పరిరక్షణకు చర్యలు



పడమరవిప్పర్రు గ్రామంలో ఓహెచ్ఆర్ నుంచి నీటి నమూనాలు సేకరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెంటపాడు: నియోజకవర్గంలో తాగునీటి పరిరక్షణకు అధికారులు నడుం బిగించారు. వర్షాకాలం ప్రారంభం దృష్ట్యా డెల్టాలో పలు గ్రామాల్లో చెరువులు కలుషితమయ్యాయి. అయితే ఈ విషయాన్ని ఇటీవల అధికారుల రివ్యూ సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాగునీటి వల్ల రోగాలు ప్రబలకుండా ప్రధానంగా తాగునీటి చెరువుల ప్రక్షాళనకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచనలు చేయడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, వైద్య సిబ్బంది స్పందించారు. దీంతో పసర్లు దేరిన విప్పర్రు భారీ చెరువు నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపినట్లు పెంటపాడు వైద్యాధికారి తోట రాజేష్ తెలిపారు. అదే విధంగా ప్రత్తిపాడు గ్రామంలో గత కొద్దిరోజులుగా తాగునీటి ప్రక్షాళనకు చర్యలు తీసుకొంటున్నారు. రెండు రోజుల నుంచి ముగ్గు చల్లించి క్రిమికీటకాలు చేరకుండా అధికారులు చర్యలు తీసుకొన్నారు. అదే విధంగా యానాలపల్లి, కె. పెంటపాడు, వల్లూరుపల్లి పలు గ్రామాల చెరువులు కలుషితం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యాసంస్థల బంద్ సంపూర్ణం



పట్టణంలో బంద్ చేస్తున్న విద్యార్థి సంఘాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో గురువారం విద్యాసంస్థల బంద్ కార్యక్రమం విజయవంతమయ్యింది. నీట్ పరీక్షలో లోపాలు ఇతర విద్యా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా చేపట్టిన బంద్‌లో భాగంగా తాడేపల్లిగూడెంలో పాఠశాలలు, కళాశాలలు బంద్ పాటించాలని పీడీఎస్‌యూ అధ్యక్షుడు రూపా శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా రూపా శంకర్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ జాతీయ స్థాయిలో పరీక్షలు నిర్వహించడంలో విఫలమైందని, తీవ్రమైన అవకతవకలు జరిగినట్లు చెప్పారు. బాధ్యతా రాహిత్యంతో పరీక్షలు నిర్వహించడం సరికాదని విమర్శించారు. నీట్ పరీక్ష లీకేజీ తెరవ వెనుక కుంభకోణం ఉందన్నారు. నీట్-పీజీ పరీక్షలను 12 గంటల ముందు వాయిదా వేయడం, యూజీసీ నెట్ పరీక్ష రద్దు చేయడం వంటివి విద్యార్థులలో తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. నీట్ స్కాంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఎన్.శ్రీనివాసరాజు, జి.రాజేష్, ఎస్.బబ్లు, బి.లక్ష్మణ్, బన్నీ, రాజేష్, పి.నాగేంద్రబాబు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

18న సైన్స్ టాలెంట్ టెస్ట్

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం, ఉంగుటూరు నియోజకవర్గం స్థాయిలో జిల్లా విద్యాశాఖ అధికార్ల అనుమతితో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌లో పదో తరగతి చదువుతున్న బాల బాలికలకు భారత శివశక్తి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆత్మబంధువులం సేవా సంఘ సభ్యులు తెలిపారు. సేవా సంఘం వారిచే ఈ నెల 18వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు మాగంటి సీతారామదాసు కల్యాణ మండపంలో టెస్ట్ జరుగుతుందన్నారు. టెస్ట్ అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు మానసిక వికాస తరగతులు, లాఫింగ్ థెరపీ, భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు, పది కన్సోలేషన్ బహుమతులు అందజేస్తారని చెప్పారు. వివరాలకు సేవా సంఘం అధ్యక్షుడు వెజ్జు దుర్గా ప్రసాద్, ఫౌండర్ సెక్రటరీ శీతాళం ఉషాకిరణ్‌లను సంప్రదించాలని కోరారు.

మేడపాడు శివాలయంలో మాస శివరాత్రి



ప్రత్యేకాలంకరణలో ఉమా రామలింగేశ్వరస్వామి

యలమంచిలి: మాస శివరాత్రి సందర్భంగా గురువారం మేడపాడు శివాలయంలో ఆలయ అర్చకులు బాదంపూడి చిరంజీవి శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. భక్తుల సహకారంతో పూలతో పార్వతీ పరమేశ్వరుల మూల విరాట్టులను సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి



వంగవీటి మోహన్ రంగా జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం (టీఓసీ): వంగవీటి మోహన్ రంగా భౌతికంగా లేకపోయినప్పటికి ప్రజల గుండెల్లో జీవించే ఉన్నారని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. వంగ జయంతిని గురువారం పట్టణంలోని గొల్లగూడెం సెంటర్‌లోను, స్థానిక తణుకు రోడ్డులో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లలర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ రంగా వ్యక్తి కాదని, మహాశక్తి అని, కాపు సామాజిక వర్గంలో పుట్టినప్పటికి బడుగు, బలహీన వర్గాల తరుపున పోరాడిన మహా నాయకుడు అని కొనియాడారు. బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి, వర్తనపల్లి కాశీ, రామిశెట్టి సురేష్, మాకా శ్రీనివాసరావు, ఏపూరి సాయి, డి.శ్రీను, కాపు సామాజిక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

అల్లూరి మహనీయుడు

మన్యం ప్రజల కష్టాలకు చలించిన మహనీయుడు అల్లూరి అని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణ ఆర్టీసీ బస్టాండ్ వద్ద అల్లూరి జయంతిని ప్రభుత్వం తరుపున నిర్వహించారు. సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. బొలిశెట్టి మాట్లాడుతూ అల్లూరి జీవిత విశేషాలను వెల్లడించారు. టీడీపీ నేత వలవల బాబ్జీ, బీజేపీ నేత ఈతకోట తాతాజీ, మునిసిపల్ కమిషనర్ డి.మురళీకృష్ణ, క్షత్రియ సేవా సమితి ప్రతినిధి సీహెచ్ఏఆర్‌కే వర్మ, పేరిచర్ల మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

తాడేపల్లిగూడెం: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు గురువారం భీమవరంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిస్థితుల గురించి చర్చించారు.

టీడీఎస్‌పై అవగాహన సదస్సు

నరసాపురం రూరల్: ఆదాయపు పన్ను శాఖ నిర్దేశించిన ప్రకారం మినహాయించిన టీడీఎస్ మొత్తాన్ని సకాలంలో ప్రభుత్వానికి జమ చేయాలని టీడీఎస్ అధికారి శ్రీనివాసరావు, వాణిజ్య పన్నులశాఖ అధికారులు ఎస్.శ్రీనివాసరావు, ఆర్.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. మండలంలోని సీతారామపురంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం కాంట్రాక్టర్లు, వ్యాపారులకు, ఆదాయపు పన్నుశాఖ ఆధ్వర్యంలో టీడీఎస్ పై అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదాయపుపన్ను శాఖ టాక్స్ డిడాక్టడ్ సోర్స్ (టీడీఎస్) నిబంధనను అనుసరించి చెల్లింపులు జరిపే ముందు పాన్, టిన్ నెంబర్లు క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి పక్రియ చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యాపారులు, వర్తక సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ డ్రాయింగ్ ఆఫీసర్లు తెలిపిన సమస్యలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, ట్రెజరర్ కేవీ సత్యనారాయణ, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి పాల్గొన్నారు.

జోరందుకుంటున్న వరినాట్లు

- డెల్టా ప్రాంతంలో ఏకకాలంలో ఊడ్పులు
- బెంగాలీల రాకతో తీరిన కూలీల కొరత



అలంపురం సమీపంలో బెంగాలీల నాట్లు



చిలకంపాడు లాకుల ఆయకట్టులో పుడమికి పచ్చబొట్లు



దువ్వ- కొండేపాడు ప్రాంతంలో వేగంగా దుక్కులు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: వర్షాలు కురవడంతో మండలంలోని ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి. చాలా గ్రామాల్లో ముందస్తు వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సమృద్ధిగా నీరు ఉండటం దీనికి తోడు వర్షాలు సైతం రావడం రైతులకు సాగు పనులకు తోడ్పాటు లభించింది. ట్రాక్టర్‌తో దుక్కిదున్నుటం, నారులు వేయడం ఇతర ప్రాంతాల నుంచి నారు తీసుకురావడం, ఊడ్పులు ప్రారంభించడం జరుగుతుంది. వర్షం వల్ల రైతులు హర్షం ప్రకటిస్తూ దుక్కి పనులు పూర్తి చేస్తూ నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. మరో వారం రోజుల్లో నూరు శాతం నాట్లు పూర్తయ్యేలా వర్షం రైతులకు మేలు చేస్తోంది. కాగా వర్షం దోబూచులాడటంతో ఈ సార్వా పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ప్రధానంగా గూడెం మండలంలో ఇప్పటికే నాట్లు 60 శాతం పూర్తయ్యాయి. పెంటపాడు మండలంలో మరో 70 శాతం నాట్లు వేయాల్సి ఉంది. దీని కోసం రైతులు చేలు దుక్కిచేసి చదునుచేసే పనిలో ఉన్నారు. కొన్ని గ్రామాల్లో నాట్లు పూర్తయ్యాయి. మండలంలో 23 వేల ఎకరాలకు గానూ 8 వేల ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు. మరో రెండు వేల ఎకరాల్లో యంత్రాలు, బెంగాలీ కూలీలతో నాట్లు వేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. నాట్లు వేసే సమయంలో చివర్లు తుంచాలని, జింక్ లోపం నివారించుకోవాలని మొక్కలకు మధ్య తగినంత ఎడం ఉండాలని పలు సూచనలు చేస్తున్నారు. కాగా మరో వారం రోజుల్లో మండలంలో నాట్లు పూర్తి చేసేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. వ్యవసాయ కూలీలు అక్కడి వ్యవసాయ పనులతో బిజీగా ఉన్నారు.